నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, శుక్రవారం 13 జూన్ 2025 SIDDIPET

## అమర్‌నాథ్‌లో అన్నదానం దైవ సంకల్పం



అమర్‌నాథ్‌కు వెళ్లే ఆహార పదార్థాల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

- అందరూ సేవాతత్వం అలవర్చుకోవాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జూన్ 12: సిద్దిపేట సేవాపరులకు నిలయమని, మన పేరు ప్రపంచమంతటా వినిపిస్తున్నదని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో 14 ఏండ్లుగా అమర్‌నాథ్‌లో అన్నదానం నిర్వహిస్తున్నారు. యాత్రికుల కోసం తరలి వెళ్లే ఆహార పదార్థాల వాహన పూజ, శివపార్వతుల కల్యాణం శరభేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి వైభవంగా జరిగింది. కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరై కల్యాణంలో పాల్గొని,ఆహార పదార్థాల వాహనాన్ని జెండా ఊపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్నదానానికి మించిన దానం మరోటి లేదన్నారు. హిమగిరుల్లో వెలిసిన అమర్‌నాథ్‌లో సిద్దిపేట వారు అన్నదానం చేయడం దైవ సంకల్పం అన్నారు.మనిషికి ఆస్తులు,అంతస్తులు కంటే సాయం చేయడంలోనే నిజమైన తృప్తి, ఆనందం కలుగుతుందన్నారు. ఇదే స్ఫూర్తిని సిద్దిపేట వారు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, బీఆర్ఎస్ సీనియర్ నేత రాధాకృష్ణశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి చైర్మన్ చీకోటి మధుసూదన్, అధ్యక్షుడు కాచం కాశీనాథ్, గంజి రాములు, గోపిశెట్టి శరభయ్య, ఉప్పల భూపతి, లేఖ్‌రాజ్, అయిత రత్నాకర్, గంప శ్రీనివాస్, నందిని శ్రీనివాస్, పూజల వెంకటేశ్వర్లు, మంకాల నవీన్‌కుమార్, లక్ష్మన్, గందే ఈశ్వర్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 18న ఆర్టిజన్ల ధర్నాను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్వామి

నర్సాపూర్, జూన్ 12: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ జేఏసీ జిల్లా చైర్మన్ స్వామి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని లింగాపూర్‌లో గల వ్యవసాయ క్షేత్రంలో నర్సాపూర్ సబ్ డివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18న ఆర్టిజన్స్ కన్వర్షన్ కోసం కుటుంబాలతో కలిసి చేపట్టే ఛలో ఇందిరా పార్కు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీనికి నిరసనగా ఈనెల 18న ఇందిరా పార్కు వద్ద భారీ బహిరంగ సభ, ధర్నా నిర్వహించి అదే రోజు విద్యుత్ సంస్థ మేనేజ్‌మెంట్లకు ఆర్టిజన్స్ కన్వర్షన్ కోసం సమ్మె నోటీసు ఇస్తామన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు నర్సింగరావు, అడ్వైజర్ మహేందర్‌రెడ్డి, కో-కన్వీనర్ నాగరాజు, జాయింట్ సెక్రటరీ సురేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మురళీ, సోషల్ మీడియా కన్వీనర్ నాగరాజు, ఈ.నాగరాజు, నరేశ్ పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో స్థిర ఆదాయం

- ఒక్కసారి పంట వేస్తే 30ఏండ్ల వరకు ఖాత
- నర్మెటలో పామాయిల్ రిఫైనర్ ఫ్యాక్టరీ సిద్ధం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

### సాగుకు రైతులు ముందుకు రావాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



గోపులాపూర్‌లో ఆయిల్‌పామ్ తొలి గెలలు కోస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

నారాయణరావుపేట, జూన్ 12: ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిర ఆదాయం పొందవచ్చని, అంతర పంటలు సాగుచేసి అదనపు ఆదాయం ఆర్జించవచ్చని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలంలోని గోపులాపూర్‌లో మాజీ ఎంపీపీ బాలకృష్ణ ఆయిల్‌పామ్ తోటలో గెలల తొలి కోతను హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనికి సత్ఫలితం వచ్చినప్పుడే నిజమైన సంతృప్తి, సార్థకత ఉంటుందన్నారు. సిద్దిపేట రైతుల్లో నమ్మకం, స్థిరమైన ఆదాయం కోసం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కండ్ల ముందు రైతులు ఫలితాలు అనుభవిస్తుంటే, ఓవైపు సంతోషం కలుగుతుందని, మరోవైపు తన కల నిజమైందని అన్నారు. ఆయిల్‌పామ్ ఆదాయం మరింత పెరు డోకా లేని పంట అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని నర్మెటలో రూ.350 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ పంటకు రాళ్లవాన వరమని, చీడ పీడల బాధ ఉండదన్నారు. అశ్వారావుపేటలో రైతుల తరహాలో సిద్దిపేట రైతులు అభివృద్ధి చెందాలని తన కోరిక అన్నారు. ఈ పంటకు చాలా సబ్సిడీలో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక్కసారి ఆయిల్‌పామ్ మొక్కలు నాటితే 30 ఏండ్ల వరకు పంట ఉంటుందని, రాను రాను గుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రిఫైనరీలకు కొమ్ము కాస్తుందని ఆరోపించారు. కేంద్రం ఏడాదిలో రూ. లక్ష కోట్ల నూనె గింజలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో విదేశీ మారక ద్రవ్యం మనం కోల్పోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో సాగును ప్రోత్సహించినట్లు తెలిపారు. వరిపంట వేస్తే రెండు పంటలకు రూ.50 వేల ఆదాయం వస్తే, ఆయిల్ పామ్ సాగుతో లక్షా యాభై వేలు ఆదాయం వస్తుందన్నారు. పదువులు ఉంటాయి.. పోతాయి.. కానీ, రైతులకు సేవ చేయడంలో నిజమైన సంతృప్తి ఉంటుందన్నారు. యువత ఆన్‌లైన్ గేమ్స్ ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, గంజాయి లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మానవసేవే మాధవసేవ

- రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి



సత్యసాయి సంజీవని దవాఖానకు అంబులెన్స్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ హైదరాబాద్ ఆదర్శ ప్రతినిధులు

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 12: మానవసేవే మాధవసేవ అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ముఖ్య సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలోని సత్యసాయి సంజీవని దవాఖానకు గురువారం లయన్స్ క్లబ్ హైదరాబాద్ ఆదర్శ ప్రతినిధులు అంబులెన్స్‌ను రమణాచారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. మానవ సేవే మాధవసేవ అనే గొప్ప సంకల్పంతో సత్యసాయి సేవా ట్రస్ట్ సేవలు అందిస్తున్నదన్నారు. వారి సేవలు వెలకట్టలేనివన్నారు. ఎంతో మంది చిన్నారులకు ఉచితంగా సేవలు అందిస్తూ ప్రాణదానం చేసిన ఘనత సంజీవని దవాఖానకు దక్కుతుందన్నారు. ఇలాంటి సేవలకు తమ వంతు తోడ్పాటుగా అంబులెన్స్‌ను అందజేసిన హైదరాబాద్ లయన్స్ క్లబ్ ఆదర్శ ప్రతినిధులను రమణాచారి అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆదర్శ ప్రతినిధులు నయనదేవి, సుబ్బలక్ష్మి, కృష్ణకుమారి, సుజాత, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ, ఆపూర్వ, సంజీవని దవాఖాన నిర్వాహకులు జగన్నాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

## యాదవులకు పెద్దపీట వేశాం




యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మంత్రివర్గంలో యాదవులను విస్మరించిన కాంగ్రెస్
- సిద్దిపేటలో యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జూన్ 12: కేసీఆర్ పాలనలో యాదవుల సంక్షేమానికి పెద్దపీట వేశామని, యాదవులకు మంత్రి పదవితో పాటు హైదరాబాద్‌లోని కోకాపేట లో ఆత్మ గౌరవ భవనం నిర్మించామని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేటలోని శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్‌హాల్‌లో యాదవ విద్యావంతుల వేదిక ఎంప్లాయీస్ సొసైటీ సహకారంలో యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలలు గడుస్తున్నా యాదవుల సంక్షేమానికి ఎలాంటి పథకాలు అమలు చేయడం లేదన్నారు. మంత్రివర్గంలో యాదవులకు అవకాశం కల్పించలేదన్నారు. గొర్రెల పంపిణీ పథకాన్ని బంద్‌జేసిందన్నారు. వెటర్నరీ దవాఖానల్లో మందులు లేక గొల్లకుర్మలు తమ జీవాలకు వైద్యం చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైనా విద్యాశాఖకు ఇప్పటికీ మంత్రి లేడన్నారు. సర్కారు బడుల బలోపేతం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మనఊరు-మనబడి' కార్యక్రమాన్ని రేవంత్ సర్కారు రద్దు చేసిందన్నారు. రేవంత్ సర్కారు ఒక్క స్కూల్ భవనం నిర్మించలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక పోవడంతో నేడు విద్యార్థుల చదువులు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాదవులు అన్నిరంగాల్లో రాణించాలని, అన్నివిధాలుగా తాను అండగా ఉంటానని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, యాదవ సంఘం నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్, మామిండ్ల అయిలయ్య, దువ్వల మల్లయ్య యాదవ్, ఫంక్షన్‌హాల్ చైర్మన్ రాములు యాదవ్,కవి ఉండ్రాల రాజేశం,పయ్యావుల శ్యాం యాదవ్, నూనె కుమార్, చింతల మల్లేశం, దాసరి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జూన్ 12: పిల్లలు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఇటీవల నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ ఉచిత సమ్మర్ క్యాంపు శిబిరంలో శిక్షణ పొందిన 70 మంది క్రీడాకారులకు గురువారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో సర్టిఫికెట్లు, మెడల్స్‌ను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో అన్నింట్లో రాణిస్తే కెరీర్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. చిన్నప్పటి నుంచే క్రీడలు, చదువు, యోగా లాంటివి అలవర్చుకోవాలన్నారు. సిద్దిపేట క్రీడా హబ్‌గా ఎదిగిందని, ఎంతో మంది క్రీడాకారులను తయారు చేసిందన్నారు. అత్యాధునిక హంగులతో కోటి 25 లక్షలతో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసుకున్నామని, క్రీడల్లో మరింత రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం కాసేపు వారితో ఆత్మీయంగా ముచ్చటించారు.

## ప్రభుత్వ భూముల్లో కట్టడాల కూల్చివేత

అమీన్‌పూర్, జూన్ 12: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 993లో ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేస్తుండడంతో తహసీల్దార్ వెంకటేశ్ ఆధ్వర్యంలో గురువారం జేసీబీలతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న 10 కట్టడాలను కూల్చి వేశామని తెలిపారు. కూల్చివేతల్లో డీటీ హరిచంద్రప్రసాద్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇన్‌చార్జి మంత్రిగా వివేక్ వెంకటస్వామి

- కొండా సురేఖను తప్పించిన రేవంత్ సర్కార్

సంగారెడ్డి, జూన్ 12(నమస్తే తెలంగాణ)/ సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గా వివేక్ వెంకటస్వామి నియామకం అయ్యా రు. ప్రభుత్వం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న కొండా సురేఖను ప్రభుత్వం తప్పించడం అధికార పార్టీ నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర మంత్రిగా ఇటీవలే గడ్డం వివేక్ వెంకటస్వామి బాధ్యతలు స్వీకరించారు. శాఖలు కేటాయించిన మరుసటిరోజే ప్రభుత్వం ఆయన్ను ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న కొండా సురేఖ, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహకు మధ్య విభేదాల కారణంగానే ఆమెను తప్పిం చి వివేక్ వెంకటస్వామిని జిల్లా ఇన్‌చార్జిగా నియమించినట్లు అధికార పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతున్నది.



చేగుంటలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంటలో కొనసాగుతున్న వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ 20వ వార్షికోత్సవ వేడుకలు

## కాంగ్రెస్ పాలనలో అంతా అస్తవ్యస్తం

- సంక్షేమం, పథకాల అమలులో ప్రభుత్వం విఫలం
- విద్యాసంవత్సరం, వానకాలం సీజన్ ప్రారంభమైనా సమీక్షలు నిర్వహించని మంత్రులు
- దుబ్బా క ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, జూన్ 12: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా నడుస్తున్నదని, మంత్రుల జాడ లేకుండా పోయిందని, పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా చేగుంటలో గురువారం వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ 20వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. చేగుంట ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ, బ్రహ్మశ్రీ అష్టకాల నరసింహరామశర్మ దివ్యాశీస్సులతో వైదిక నిర్వాహకులు గౌరీబట్ల నాగరాజుశర్మ, ఆలయ పూజారి గోవింద్ త్రిపాఠి ఆధ్వర్యంలో విశేష పూజలు, అన్నప్రసాదం పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతసాగర్ సరస్వతీ క్షేత్ర ధర్మాధికారి బ్రహ్మశ్రీ అష్టకాల విద్యామనోహర శర్మ పాల్గొని భక్తులకు ధార్మిక ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణశాఖ అధ్యక్షుడు తొడుపునూరి నాగరాజు, మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై అన్నివర్గాల ప్రజల అసంతృప్తిగా ఉన్నట్లు విమర్శించారు. ఇంకా మూడేండ్లు ఎలా గడుస్తాయో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్నివర్గాల సంక్షేమానికి కేసీఆర్ కృషిచేసినట్లు గుర్తుచేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం, వ్యవసాయ సీజన్ మొదలైనా జిల్లా మంత్రులు సమీక్షలు నిర్వహించలేదన్నారు. వానకాలం వచ్చినా ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని, రైతు సంక్షేమాన్ని రేవంత్ విస్మరించారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దుయ్యబట్టారు. ఇందిరమ్మ ఇల్లు 60గజాల్లోపే నిర్మించుకోవాలనే ప్రభుత్వ నిబంధనతో చాలామంది ఇంటి నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదన్నారు. రాజీవ్ యువ వికాసం అమలు పత్తాలేకుండా పోయిందన్నారు. గ్రామాల్లో పాలన పడకేసిందన్నారు. పచ్చదనం, శుభ్రత కోసం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేస్తే, వాటికి డీజిల్ పోయలేక పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోలకు తాళాలు అప్పగిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ అయిత వెంకటలక్ష్మి, హనుమయ్య, బాలేశం, నాగభూషణం, రాజేశ్వర్, వేణు, రాఘవ, నర్సింహులు, బచ్చు రమేశ్, కిరణ్, మహేశ్, ఎర్ర యాదగిరి, ఇమ్మడి లక్ష్మణ్, జీవన్‌రెడ్డి, బండి విశ్వేశ్వర్, రాజు, నాగరాజు, శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

## ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహించిన దినేశ్

సిద్దిపేట అర్బన్, జూన్ 12: సిద్దిపేటలోని ఎల్లంకి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి డి.దినేశ్ ఇటీవల నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ శిఖరాన్ని ఈనెల 3న అధిరోహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగలత గురువారం తెలిపారు. ఎంజేపీ సొసైటీ నుంచి పది మంది బాలురు, పది మంది బాలికలను ఎంపిక చేసి ఎవరెస్ట్ బేస్ క్యాంపునకు పంపించారని, ఈ గ్రూప్‌లో తమ పాఠశాల విద్యార్థి డి.దినేశ్ ఉన్నట్లు తెలిపారు. దినేశ్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, గురుకుల పాఠశాలల సెక్రటరీ సైదులు అభినందించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడల, ఇతర రంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు.



ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లో దినేష్

## సంగారెడ్డి కలెక్టర్‌గా ప్రావీణ్య

- టూరిజం శాఖ ఎండీగా వల్లూరు క్రాంతి బదిలీ



పి.ప్రావీణ్య, సంగారెడ్డి కలెక్టర్



హైమావతి, సిద్దిపేట కలెక్టర్

సంగారెడ్డి, జూన్ 12(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. వల్లూరు క్రాంతి జనవరి 4, 2024న సంగారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 15 నెలల పాటు కలెక్టర్‌గా పనిచేశారు. మహిళా సాధికారిత కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారు. జహీరాబాద్ ఎంపీపార్లమెంట్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా చూశారు. ఆమె బదిలీ అవుతారని కొద్ది నెలలుగా జిల్లాలో ప్రచారం సాగుతూ వచ్చింది. గురువారం ఆమె బదిలీ ఉత్తర్వులు వెలువడటం అధికార, రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అసంతృప్తి కారణంగానే కలెక్టర్ క్రాంతిని అప్రాధాన్యమైన టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదిలీ చేసినట్లు తెలుస్తుంది. హన్మకొండ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.ప్రావీణ్యను సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాకు చెందిన పి.ప్రావీణ్య 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి పి.ప్రావీణ్య జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. ఆ తర్వాత హన్మకొండ కలెక్టర్‌గా నియమితులయ్యారు.

### సిద్దిపేట కలెక్టర్‌గా హైమావతి

సిద్దిపేట, జూన్ 12: సిద్దిపేట కలెక్టర్‌గా కె.హైమావతిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.మనుచౌదరి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హైమావతిని సిద్దిపేట కలెక్టర్‌గా నియమిస్తూ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

## పరిశోధనలు విస్తృతం చేసే దిశగా అడుగులు

- ఐఐటీహెచ్-ఐఎస్‌యూలు ఐకేఎస్‌తో ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, సీఎస్‌యూ వీసీ శ్రీనివాస వరాఖేడి

కంది, జూన్ 12: సాంకేతికత ఆధారిత పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు ఐఐటీ హైదరాబాద్, సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయం (సీఎస్‌యూ) న్యూఢిల్లీ సంయుక్తంగా భారతీయ జ్ఞాన వ్యవస్థలు (ఐకేఎస్)తో ఒప్పందం చేసుకున్నాయి. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో గురువారం ఒకరికొకరు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. సంస్కృతం, భాషాశాస్త్రం, వేదశాస్త్రాలు, తత్వశాస్త్రం అనుబంధ విభాగాల్లో విద్యా సహకారం, ఉమ్మడి అభ్యాసం, ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలు సులభతరం చేయడం, సంప్రదాయం, సాంకేతికతను వారధిగా చేసే అంతర్ విభాగ పరిశోధన ప్రాజెక్టుల అభివృద్ధి, పాండిత్యం-అభ్యాసన నాణ్యతను పెంపొందించేందుకు విద్యా విధానం, కోర్సు సామగ్రి, పరిశోధన ఫలితాలను క్రమం తప్పకుండా మార్పిడి చేసుకోవడం తదితర అంశాలపై ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. ఐఐటీహెచ్‌లోని హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సీఎస్‌యూతో కలిసి సంప్రదాయ పురాతన జ్ఞానాన్ని ఆధునిక సైన్స్ టెక్నాలజీతో సంభాషణలోకి తీసుకురావడం, విద్యలో కొత్తకోణాలను అన్‌లాక్ చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాస వరాఖేడి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్కారు బడికి తాళం





గేట్‌కు తాళం వేస్తున్న ఎస్ఎంసీ మాజీ చైర్మన్, వివరాలు సేకరిస్తున్న పోలీసులు

- బిల్లులు చెల్లించకపోవడంతో ఎస్ఎంసీ మాజీ చైర్మన్ నిరసన

చేర్యాల, జూన్ 12: అప్పులు తీసుకువచ్చి పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టిన ఎస్ఎంసీ మాజీ చైర్మన్‌కు 18 నెలలుగా బిల్లులు రాకపోవడంతో విధిలేని పరిస్థితిలో ఆ పాఠశాల ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన తెలిపిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో చోటుచేసుకుంది. ఆకునూరు జడ్పీహెచ్‌ఎస్‌లో రెండేండ్ల క్రితం 'మనఊరు-మనబడి' కార్యక్రమంలో మంజూరైన పనుల్లో రూ.8.50 లక్షలు ఖర్చుచేసి నాటి ఎస్ఎంసీ చైర్మన్ కోతి దాసు నూతనంగా డైనింగ్ హాల్ నిర్మాణం, వివిధ ప్రదేశాల్లో టైల్స్ వేయడంతో పాటు పాఠశాలలో కరెంటు సరఫరాకు సంబంధించిన పనులు పూర్తిచేశాడు. తాను చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని ఆయన మొరపెట్టుకున్నా జిల్లా,డివిజన్, మండల స్థాయి అధికారులకు విన్నవించినా పనికాలేదు. దీంతో ఆవేదన చెందిన ఆయన వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పున:ప్రారంభం రోజున గురువారం ఉదయమే హైస్కూల్ ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఎస్ఐ నీరేశ్ పాఠశాల వద్దకు చేరుకుని ఎస్ఎంసీ మాజీ చైర్మన్‌తో మాట్లాడి విషయాన్ని డీఈవో, ఏసీపీల దృష్టికి తీసుకుపోయారు.డీఈవో హామీతో ఎస్ఎంసీ మాజీ చైర్మన్ గేట్ తాళం తీశారు.

## ఏడేండ్ల తర్వాత తెరుచుకున్న బడి



గంగాపూర్‌లో తెరుచుకున్న సర్కారు బడి

మర్కూక్, జూన్ 12: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం గంగాపూర్ సర్కారు బడి ఏడేండ్ల శనికాలం పూర్తిచేసుకుంది. గ్రామస్తుల తోడ్పాటు, ప్రభుత్వ ఉపాధ్యాయుల శ్రమ ఫలించి గురువారం రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు, సంచాలకులు కృష్ణారావు, జిల్లా అధికారి రంగనాథ్ సమక్షంలో ప్రభుత్వ బడి తలుపులు తెరిచారు. గతంలో పిల్లలు రావడం లేదని ఈ బడిని మూసేశారు. ఐదు రోజులుగా గ్రామం లో జరిగిన బడిబాట కార్యక్రమంతో ఉత్తేజితులైన గ్రామస్తులు, తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు బదులుగా గ్రామంలోని ప్రభుత్వ బడికే పంపుతామని ముందుకు వచ్చారు. దీంతో అధికారులు వారిని అభినందించి పిల్లలకు స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం మర్కూక్ ఉన్నత పాఠశాలను డీఐఈజీ కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు దుస్తు లు, నోట్‌పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరాములు, మాజీ ప్రజాప్రతినిధులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.